31వ వసంతంలోకి

చురకలు

కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్లా

శుక్రవారం,సెప్టెంబర్ 04 ,2026

పేజీలు : 8

# అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తాం



**చురకలు ప్రతినిధి సిరిసిల్ల, సెప్టెంబర్ 03 :** అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని, సొంత ఇంటి కల సాకారం చేస్తామని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు.మొదటి విడత కింద మంజూరు అయి నిర్ణీత సమయంలో ఇండ్లు నిర్మించుకొని వారి స్థానంలో నూతనంగా 710 మందికి ఇందిరమ్మ ఇండ్ల మంజూరు ధ్రువ పత్రాల పంపిణీ కార్యక్రమాన్ని తెలంగాణ గృహ నిర్మాణ సంస్థ ఆద్వర్యంలో సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని సాయి మణికంఠ ఫంక్షన్ హాల్ లో గురువారం నిర్వహించగా, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీలు, ఆయా మండలాల లబ్ధిదారులకు ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్, అధికారులతో కలిసి మంజూరు పత్రాలు అందజేశారు.ఆయా మండలాల వారికి స్టాళ్లు ఏర్పాటు చేసి.. అధికారులు మంజూరు పత్రాలు-మిగతా 2లో

# దేవుళ్లని మోసంచేసిన చరిత్ర బిఆర్ఎస్‌ది

## ఎస్సీ ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



**చురకలు విలేకరి, ధర్మపురి, సెప్టెంబర్ 3:** తెలంగాణ రాష్ట్రంలో బిఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో దేవుడు సన్నిధిలో ప్రజలకు హామీ ఇచ్చి పుణ్యక్షేత్రాలకు ఎటువంటి నిధులు కేటాయించకుండా దేవుణ్ణి మోసం చేసిన చరిత్ర మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మరియు బిఆర్ఎస్ పార్టీ దని తెలంగాణ రాష్ట్ర ఎస్సీ ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆరోపించారు. గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి హోదాలో కొండగట్టు, ధర్మపురి, భద్రాద్రి వేములవాడ పుణ్యక్షేత్రాలకు వెళ్లి ప్రెస్ మీట్ ఏర్పాటు చేసి ప్రజా సాక్షిగా కోట్లాదినిధులు విడుదల చేస్తున్నారని హామీ ఇచ్చి దేవునికి మోసం చేశారన్నారు. నేడు 1000 రోజుల పాలనలో అవినీతి చేశామని ఆరోపిస్తున్న నాయకులు ఈనెల 7 తారీఖున ప్రారంభం కాబోతున్న అసెంబ్లీ సమావేశంలో తేల్చుకుందామని కెసిఆర్ హరీష్ రావు కేటీఆర్ లు సిద్ధంగా ఉండాలని సవాల్ చేశారు. గతంలో మంత్రిగా పనిచేసిన కొప్పుల ఈశ్వర్ ధర్మపురిని ఎందుకు అభివృద్ధి చేయలేదని ధర్మపురిలో నైట్ కాలేజ్ ఎందుకు ప్రారంభించలేదని అదేవిధంగా డివిజన్ ఏర్పాటు ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. కోరుట్ల నియోజకవర్గంలో రెవెన్యూ డివిజన్ తో పాటు రెండు బస్ డిపోలు ఉండగా మంత్రిగా ఉండి ధర్మపురికి బస్సు డిపో ఎందుకు మంజూరు చేయించలేదన్నారు. 2023 డిసెంబర్ లో అధికారం వచ్చినటువంటి ధర్మపురి అభివృద్ధి కోసం కృషి చేస్తున్నామని అప్పుల తో రాష్ట్ర ప్రభుత్వాన్ని అప్పగిస్తే అప్పులను కడుతూ సంక్షేమం మరియు అభివృద్ధిని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముందుకు తీసుకెళ్తున్నారని పేర్కొన్నారు. ఇంకా తెలంగాణ రాష్ట్ర ప్రజలు మాకు ఇచ్చిన సమయం మిగిలిందని ఆలోపు మేము హామీ ఇచ్చిన పనులన్నీ పూర్తి చేసి మాట నిలుపుకొని ఎన్నికలకు వెళ్తామని తెలిపారు. ఇప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో నాలుగు హామీలు నెరవేర్చమని మిగతా రెండు కూడా త్వరలోనే పూర్తి చేసి ప్రజలకు అందిస్తామన్నారు. ధర్మపురి మండలంలో ఇప్పటికే 200 కోట్ల వ్యయంతో ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం ప్రారంభించామని అదేవిధంగా డిగ్రీ ప్రభుత్వ కళాశాలను ఏర్పాటు చేశామని గోదావరిలో మురికి నీరు కలవకుండా సివరేజ్ ప్లాంట్ ఏర్పాటు కోసం 17 కోట్లు నిధులు మంజూరు చేయించామని ధర్మపురి నియోజకవర్గంలో భూనిర్వాసితులకు పునరావాసం కోల్పోయిన వారికి పునరావాసం కల్పించామని పేర్కొన్నారు. ధర్మపురి నియోజకవర్గానికి గతంలో అనేక త్రాగు నీరు సాగు నీరు కోసం ప్రజలు అనేక ఇబ్బందులు ఉన్నాయని నేడు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినాటి నుండి ప్రజలు ఎవరు త్రాగునీరు సాగునీరుకు ఇబ్బంది పడలేదన్నారు మీ ప్రభుత్వంలో ప్రజలు బిందెలతో జాతీయ రహదారిపై నిరసన తెలిపారని మా ప్రభుత్వం ఏర్పాటు నుండి ఎవరైనా రోడ్డు ఎక్కరా అని ప్రశ్నించారు. మీ ప్రభుత్వంలో ప్రజలకు అన్ని సౌకర్యాలు కల్పించినట్లయితే నేడు ఈ పరిస్థితి ఉండేదా మీరు మొదలుపెట్టిన రొల్లవాగు ప్రాజెక్ట్ -మిగతా 2లో

## రైతు రాజ్యం రావాలంటే ..

# కేసీఆర్ అధికారంలోకి రావాలి..!

**-ప్రజావ్యతిరేక కాంగ్రెస్ ప్రభుత్వానికి పతనం తప్పదు**

**-420 హామీలతో ప్రజలను మోసం చేసిన రేవంత్ రెడ్డి**

**-చక్కర ఫ్యాక్టరీ పునరుద్ధరణకు ఉద్యమిద్దాం**

**మాజీ మంత్రి జీవన్ రెడ్డి**




**చురకలు విలేకరి, రాయికల్, సెప్టెంబర్ 3:** రైతుల సమస్యలు పోయి రైతు రాజ్యం రావాలంటే కెసిఆర్ అధికారంలోకి రావాలని మాజీ మంత్రి జీవన్ రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రాష్ట్ర ప్రభుత్వ వెయ్యి రోజుల పాలన వైఫల్యాలు, రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ రాయికల్ పట్టణంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, రైతుల భారీ ర్యాలీ చేపట్టారు.రైతు సదస్సుకు ముఖ్య అతిథులుగా బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్ రెడ్డి, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్,జిల్లా పరిషత్ మాజీ ఛైర్పర్సన్ దావ వసంత హాజరయ్యారు.రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ వెయ్యి రోజుల పాలనలో రైతుబంధు రైతు బీమా నీరుగార్చడంతో పాటు వరి ధాన్యం సేకరణలో తరుగు పేరిట కోత.. వరి ధాన్యానికి బోనస్ ఎగవేత.. అర కొర విద్యుత్ సరఫరాతో రైతాంగాన్నీ ఇ బ్బందులకు గురి చేయడం పట్ల.. నిరస న వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ కేసీఆర్ ఉద్యమ నేతగా రాష్ట్రాన్ని సాధించి, అంతర్జాతీయ స్థాయి లో రాష్ట్రాన్ని అభివృద్ధి చేశారని ప్రజలను ఆశల పల్లకిలో ఊరేగించి,కాంగ్రెస్ అధికారంలో వచ్చిందన్నారు.తెలంగాణ ప్రజలు రేవంత్ రెడ్డిని నమ్మరని వరంగల్ లో జరిగిన-మిగతా 2లో

## ఎన్నికల్లో ఇచ్చిన హామీలను

# వెంటనే అమలు చేయాలి

**-కల్వల ప్రాజెక్టును తక్షణమే నిర్మించాలి**

**-హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి**



**చురకలు విలేఖరి, వీణవంక సెప్టెంబర్ 03 :** బీఆర్ఎస్ పార్టీ పిలుపుమేరకు కరీంనగర్ జిల్లా వీణవంక మండల కేంద్రంలో హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలకు వ్యతిరేకంగా రైతులతో కలిసి గురువారం భారీ ర్యాలీ, నిరసన ప్రదర్శన నిర్వహించారు. స్థానిక బస్టాండ్ కూడలి వద్ద రైతులు, పార్టీ శ్రేణులతో కలిసి బైఠాయించి, కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఎన్నికల వేళ ప్రజలను ఆకట్టుకోవడానికి దేవుళ్ల సాక్షిగా ఇచ్చిన 6 గ్యారెంటీలు, 420 హామీలను అధికారంలోకి రాగానే అటకెక్కించారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతు కూలీలకు ఇస్తామన్న ?12,000 సాయం అతీగతీ లేదని, వ్యవసాయ పెట్టుబడి సాయాన్ని సైతం అటకెక్కించారని మండిపడ్డారు.వడ్లకు ఇస్తామన్న క్వింటాలుకు ?500 బోనస్ జాడ లేదని దుయ్యబట్టారు. వృద్ధులు, వితంతువులతో పాటు పద్మశాలీలకు ఇస్తామన్న 4,000 పెన్షన్, అలాగే వికలాంగులకు ఇస్తామన్న ?6,000 పెన్షన్‌ను ఎందుకు అమలు చేయడం లేదని ప్రభుత్వాన్ని నిలదీశారు. ఆడబిడ్డల పెళ్లిళ్లకు ఇస్తామన్న తులం బంగారం హామీ ఏమైందని ప్రశ్నించారు. ప్రతీ నెల మహిళలకు ఇస్తామన్న ?2,500 సాయం ఇంతవరకు అతీగతీ లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులు, యువత రాష్ట్రంలో కాలేజీలకు -మిగతా 2లో

## ముస్లిం సెంట్రల్ కమిటీ ఎన్నికలకు సర్వం సిద్ధం

### -నేడు 25 మసీదుల్లో పోలింగ్



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, సెప్టెంబర్ 3 :** జగిత్యాల ముస్లిం సెంట్రల్ కమిటీ అధ్యక్ష ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని జగిత్యాల ముస్లిం సెంట్రల్ ఎన్నికల కమిషనర్ మహమ్మద్ ఇమ్రాన్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పట్టణంలోని అన్ని మసీదుల్లో శుక్రవారం ప్రత్యేక ప్రార్థనల అనంతరం పోలింగ్ జరుగుతుందని, అన్ని మసీదుల్లో నేడు జుమ్మా నమాజ్ 1.15 నిమిషాలకు జరుగుతుందని, అన్ని మసీదులో పోలింగ్ అధికారులు, సిబ్బందిని నియమించామని తెలిపారు. ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని, పోలీస్ బందోబస్తు కూడా ఉంటుందని తెలిపారు.పోలింగ్ అనంతరం అదే రోజు ఫలితాలు వెల్లడిస్తామని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎన్నికల కమిటీ సభ్యులు ఆదిల్ పటేల్, తస్లీమ్ పాషా,రఫీక్,ఇంతియాజ్,అబ్దుల్లా,మాక్బుల్,సయ్యద్ అజీమ్,ముజాహిద్ పాట్వరి,నేహాల్,అఖీల్ ఉద్దీన్ జావీద్,షజీ ఫెరోజ్,ముజహిద్ ఆదిల్,షహేరజ ఉద్దీన్ మోసిక్,ఫజల్ బేగ్,హైదర్ అలీ,నాజీమ్,సులేమాన్,నాహిద్, అజహర్, జమీర్ అలీ అద్నన్,రియాజ్,షహేబాజ్, ఆరిఫ్, ఇక్బాల్, మక్బుల్, రూమన్, కలీమ్,ఫహద్,సవాన్, రెహన్,ఇర్షాద్, రిజ్వాన్,ముక్రమ్,తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరికలు



**చురకలు ప్రతినిధి హుజురాబాద్ సెప్టెంబర్ 3 :** ఇల్లంతకుంట మండలం లో కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ గొట్టే రాజశేఖర్, సిరిసేడు గ్రామానికి చెందిన ఎస్సీ సెల్ నాయకులు రేనుకుంట్ల జానీ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు.ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి బీఆర్ఎస్ పార్టీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ..బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌గారి నాయకత్వంపై ప్రజలకు పూర్తివిశ్వాసం ఉందని అన్నారు. తెలంగాణ అభివృద్ధి,సంక్షేమం కోసం కేసీఆర్ ప్రభుత్వం చేసిన కృషిని ప్రజలు గుర్తు చేసుకుంటున్నారని తెలిపారు.నియోజకవర్గంలో బీఆర్ఎస్‌పార్టీ మరింత బలోపేతం అవుతుందని,రాబోయే రోజుల్లో మరిన్ని చేరికలు ఉంటాయని తెలిపారు.బీఆర్ఎస్ పార్టీలో చేరిన గొట్టే రాజశేఖర్,రేనుకుంట్ల జానీ మాట్లాడుతూ..ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి నాయకత్వంలో నియోజకవర్గ అభివృద్ధి కోసం పనిచేస్తామని తెలిపారు. పార్టీ బలోపేతానికి తమ వంతు కృషి చేస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మాజీ ఎంపీపీ వెంకటేష్ సిరిసేడు సర్పంచ్ కుమార్ దామోదర్ మాజీ ఎంపీటీసీ చిన్న రాయుడు నాయకులు పాల్గొన్నారు.

## ఎల్లారెడ్డిపేట నూతన తహసీల్దార్‌గా ఆడెపు దివ్యజ్యోతి బాధ్యతల స్వీకరణ

**చురకలు ప్రతినిధి,ఎల్లారెడ్డిపేట, సెప్టెంబర్ 03 :** రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల నూతన తహసీల్దార్‌గా ఆడెపు దివ్యజ్యోతి గురువారం పదవీ బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది నూతన తహసీల్దార్‌కు శుభాకాంక్షలు తెలిపారు. మండలంలోని రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తూ, ప్రజలకు అందుబాటులో ఉండి పారదర్శకంగా విధులు నిర్వహిస్తానని దివ్యజ్యోతి తెలిపారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలు, భూ సంబంధిత సమస్యలు, ధరణి/భూ భారతి తదితర రెవెన్యూ అంశాలపై ప్రజలకు సత్వర సేవలు అందించేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయ సిబ్బందితో ఆమె సమావేశమై మండలంలోని రెవెన్యూ అంశాలపై వివరాలు తెలుసుకున్నారు.

# అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తాం

**మొదటి పేజీ తరువాయి....** పంపిణీ చేశారు. స్టాళ్లలో ఈ పంపిణీ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పరిశీలించారు.ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదేశాల మేరకు అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నామని తెలిపారు. పేదవాడి సొంత ఇంటి కల నెరవేరుస్తున్నామని వివరించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంతో పేదవాడి సొంత ఇంటి కల నెరవేరుతుందని స్పష్టం చేశారు. అలాగే ఆయా గ్రామాలు, మున్సిపాలిటీల పరిధిలో కూలీలకు ఉపాధి, వివిధ వృత్తుల వారికి పని, దుకాణదారులకు వ్యాపార లావాదేవీలు కొనసాగుతు న్నాయని వెల్లడించారు. జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయని పేర్కొన్నారు.రాష్ట్రంలో సంక్షేమ, అభివృద్ధి పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్, వ్యవసాయానికి ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణం విజయవంతంగా అమలు చేస్తున్నామని వెల్లడించారు. పథకాల అమలులో రాష్ట్రం ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్ గా ఉందని తెలిపారు. తమిళనాడులో ఉచిత విద్యుత్, కేరళలో ఉచిత బస్సు లాంటి పథకాలు అమలు చేస్తున్నారని వివరించారు. రైతులకు రూ.రెండు లక్షల వరకు రుణ మాఫీ చేశామని తెలిపారు. నూతన రేషన్ కార్డులు జారీ చేస్తున్నామని వెల్లడించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని తెలిపారు. నూతన పెన్షన్లు ఇచ్చేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని పేర్కొన్నారు. అన్ని వర్గాల అభ్యున్నతి లక్ష్యంగా ప్రభుత్వం పథకాలు అమలు చేస్తుందని వివరించారు. జిల్లాలోని ధార్మిక, కార్మిక క్షేత్రాల అభివృద్ధికి పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలు పొందిన వారు ఇండ్లు వేగంగా పూర్తి చేసుకోవాలని పిలుపు నిచ్చారు.

**సొంత ఇల్లు ప్రతి ఒక్కరి కల..**

జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ... సొంత ఇల్లు నిర్మాణం ప్రతి ఒక్కరి కల అని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలు పొందిన వారు ప్రభుత్వం నిర్ణయించిన విస్తీర్ణంలో ఇల్లుకు త్వరితగతిన ముగ్గు పోసుకోవాలని సూచించారు. ప్రతి మండల కేంద్రంలోని మోడల్ హౌస్ లను తప్పనిసరిగా సందర్శించాలని, ప్రభుత్వం ఇచ్చే రూ. ఐదు లక్షల ఆర్థిక సహాయంతోనే ఇల్లు పూర్తి చేసుకోవాలని పిలుపు నిచ్చారు.రెండో విడత కింద ప్రతి నియోజకవర్గానికి 2,000 ఇండ్లు చొప్పున మంజూరు చేసిందని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకునే వారికి నాలుగు దశల్లో మొత్తం రూ. ఐదు లక్షల ఆర్థిక సహాయం బ్యాంక్ ఖాతాల్లో జమ అవుతుందని వెల్లడించారు. పంచాయతీ కార్యదర్శి, హౌసింగ్ అధికారులు లబ్ధిదారుల ఇంటికి వచ్చి ఇండ్ల నిర్మాణ దశల ఫోటోలు తీస్తారని తెలిపారు. ఇండ్ల నిర్మాణాలు పూర్తి చేసి.. గృహ ప్రవేశాలు చేసి.. ఆనందంగా ఉండాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆకాంక్షించారు.కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ చైర్మన్లు జిందం కళ, పుల్కం రాజు, మార్కెట్ కమిటీ చైర్మన్లు తిరుపతి, ఎల్లయ్య, రాజు, స్వరూప, సబేరా బేగం, రాణి, రాములు నాయక్, విజయ, హౌసింగ్ పీడీ వెంకట మాధవ రావు, సిరిసిల్ల ఆర్డీఓ శ్రీధర్ బాబు, తహసీల్దార్ మహేష్, కౌన్సిలర్లు, సర్పంచులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# దేవుళ్ళని మోసం చేసిన చరిత్ర బిఆర్ఎస్ పార్టీది

**మొదటి పేజీ తరువాయి...**అని మధ్యలోనే నిలిపివేశారన్నారు.40 కోట్లతో ప్రారంభించి నేడు 140 కోట్లకు తీసుకెళ్లి అది కూడా పూర్తిగా చేయలేదన్నారు. మీరు ఎన్నికల సమయంలో అనేక కుల సంఘాలను పిలిచి సమావేశాలు ఏర్పాటు చేసి ప్రొసీడింగ్లు మంజూరు చేసి వారికి ఎటువంటి అభివృద్ధి పనులు మంజూరు చేయలేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పూర్తయిన పనులకు మా ప్రభుత్వం బిల్లులు చెల్లించి కాంట్రాక్టర్లను ఆదుకుందన్నామన్నారు. రాబోయే పుష్కరాల్లో ధర్మపురి పట్టణానికి 117 కోట్లు ప్రభుత్వం ఏర్పాటు చేసిందని అట్టి నిధులతో ధర్మపురిని అభివృద్ధి చేసి చూపిస్తానని పేర్కొన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతులు తమ ధాన్యాన్ని అమ్ముకోవడానికి అనేక ఇబ్బందులు పడాలని కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోలు పూర్తి చేశామన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వంలో జరిగిన కక్ష సాధింపు ఎన్నడు జరగలేదని ఇథనాల్ ప్రాజెక్టు కోసం ప్రజల పక్షాన పోరాడితే నాపై అనేక కేసులు పెట్టారని అదేవిధంగా మా కార్యకర్తలను కేసుల్లోకించి అనేక ఇబ్బందులు పాలు చేశారని నేడు పోలీసులు కేసులు పెడుతున్నారని పోలీసులను ఆరోపించడం సరికాదన్నారు. మేము మా నాయకులు ఏనాడు కేసుల పెట్టడానికి ప్రోత్సహించలేదని తెలిపారు. గతంలో మీరు డబ్బులు తీసుకొని పోలీసు అధికారులకు పోస్టింగ్ ఇచ్చి ఆ విధంగా మేము వ్యవహరిస్తున్నామని ఆరోపించడం సరికాదన్నారు. బిఆర్ఎస్ పార్టీ ఇప్పటివరకు జరిగిన అన్ని ఎన్నికల్లో ఓటమిపాలైందని ప్రజల్లో ఆదరణ కరువైందని పార్టీ ఉనికి కోసం నాయకులు పోరాడుతున్నారని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ శాఖ చైర్మన్ సంఘనపట్ల దినేష్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు చిలుముల లక్ష్మణ్, కుంట సుధాకర్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు చీపిరిశెట్టి రాజేష్, మండల ఉపాధ్యక్షుడు వేముల రాజేష్, కౌన్సిలర్ లు సంగి ఆనంద్, ఒజ్జల లక్ష్మణ్ సర్పంచ్ ల ఫోరం అధ్యక్షుడు కాసారపు బాలగౌడ్, సర్పంచులు రాందేని మొగిలి, నాయకులు సింహరాజు ప్రసాద్, రఫీక్ పోచయ్య, నేదునూరి శ్రీధర్,దొనకొండ నరేష్, ఎదులాపురం మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

## రైతు రాజ్యం రావాలంటే ..

# కేసీఆర్ అధికారంలోకి రావాలి..!

**మొదటి పేజీ తరువాయి...** బహిరంగ సభలో రాహుల్ గాంధీ రైతు డిక్లరేషన్ చేయించారన్నారు. వెయ్యి రోజుల పాలనలో చేసిన వాగ్దానాలు అమలు చేయకపోవడం పై కేసీఆర్, కేటీఆర్ సూచనల మేరకు ప్రజలను చైతన్య పరిచేందుకు నిరసన చేపడుతున్నామన్నారు.నాల్గు దశాబ్దాల రాజకీయాల అనుభవంలో టిడిపి పాలనలో రైతుల దోపిడీ పై యుద్ధం చేయాల్సి వచ్చింది ఇటువంటి పాలన చూడలేదన్నారు.యూపీఏ ఆధ్వర్యంలో తెలంగాణ ప్రాంతంలో రైతులకు విద్యుత్ భారం పడుతోందని, వ్యవసాయానికి ఉచిత విద్యుత్ అందించాలని కేసీఆర్ సూచన మేరకు కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పెట్టారని తెలిపారు.కెసిఆర్ దూర దృష్టితో నిర్మించిన కాళేశ్వరం కరువులో ప్రాజెక్ట్ గొప్పతనం తెలుస్తుందన్నారు.పదేళ్ల కాలంలో ఎస్ ఆర్ ఎస్ పి లో కాలువ నీళ్లు రాని దినం ఏనాడు చూడలేదని పేర్కొన్నారు.రైతు బంధు.. రైతు బీమా నీరుగార్చారు.రసాయనిక ఎరువులు తాగేది కాదు.. తినేది కాదు.. ఎరువుల పంపిణీ పై ఎందుకీ ఆంక్షలు అని నిలదీశారు.కేసీఆర్ పాలనలో ప్రజల కోసం..ఆస్తులు సృష్టించేందుకు 3.90 లక్షల కోట్ల అప్పు చేసిన మాట వాస్తవం కేసీఆర్ ప్రాజెక్టులు నిర్మించి అన్ని రంగాలను అభివృద్ధి చేశారని తెలిపారు.కేసీఆర్ ఉన్నప్పుడు పుష్కలంగా యూరియా లభించింది.. ఇప్పుడు యాప్ పేరిట యూరియా గోస పోసుకున్నారని మండిపడ్డారు.12000 కోట్లు ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు చెల్లించడం లేదని అనాడు గురుకులాల్లో సీటు కోసం పోటీ ఉండేది..నేడు పిల్లలను గురుకులాల్లో చేర్పించేందుకు వెనకడుగు వేస్తున్నారన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు,నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల్లో ఇచ్చిన హామీలను...

**మొదటి పేజీ తరువాయి...** దాదాపు 12,000 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పేరుకుపోయినా విడుదల చేయలేదు. అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదే 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పి నిరుద్యోగ యువతను దగా చేశారని విమర్శించారు. కల్వల ప్రాజెక్టును తక్షణమే నిర్మించాలి: ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి బిఆర్ఎస్ పార్టీ పిలుపుమేరకు నిరసన కార్యక్రమంలో హుజురాబాద్ ఎమ్మెల్యే మాట్లాడుతూ.. 2023 సంవత్సరంలో బారీ వర్షానికి మత్తడి తెగిపోయింది.కల్వల ప్రాజెక్టు పునర్నిర్మాణంపై ప్రస్తుత ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలని, వెంటనే పనులు ప్రారంభించాలని ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి డిమాండ్ చేశారు. వీణవంక, జమ్మికుంట మండలాల్లోని 7 నుంచి 8 వేల ఎకరాల రైతులకు సాగునీరు అందించే ఈ ప్రాజెక్టు కోసం గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే ?71 కోట్ల డిపిఆర్ సిద్ధం చేయించామని గుర్తుచేశారు.?అసెంబ్లీలో వందలసార్లు గళమెత్తినా పాలకులు కాలయాపన చేస్తూ రైతులను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. రైతుల పక్షాన కల్వల ప్రాజెక్టు పూర్తయ్యే వరకు తన పోరాటం ఆగదని ఆయన స్పష్టం చేశారు. మాజీ ఎంపీపీ మసిపట్ల రేణుక తిరుపతిరెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ వాల బాలకిషన్ రావు, మాడ సాధవరెడ్డి, ఫ్యాక్స్ చైర్మన్ విజయ భాస్కర్ రెడ్డి, సర్పంచులు దాసారపు సరోజన, మండల కుమారస్వామి,గాజుల శంకర్, రామిడి సంపత్ రెడ్డి,జడల రమేష్, మాజీ సర్పంచ్ నీల కుమారస్వామి,సిద్ధపల్లి మహిపాల్ రెడ్డి,మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు.

## వికలాంగుల ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి



**చురకలు విలేకరి,జగిత్యాల,సెప్టెంబర్ 3 :** వికలాంగుల సంక్షేమం పట్ల ప్రభుత్వం చిన్నచూపు ధోరణి విడనాడి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని జగిత్యాల జిల్లా వికలాంగుల సంఘం జిల్లా అధ్యక్షులు లంక దాసరి శ్రీనివాస్,ఉపాధ్యక్షులు అస్గర్ మహమ్మద్ ఖాన్‌లు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో గురువారం సంఘ నాయకులు మాట్లాడుతూ ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం,ప్రస్తుతం ఇస్తున్న రూ.4016 పెన్షన్‌ను రూ.6000కు పెంచడం వంటి హామీలు ప్రభుత్వం ఏర్పడి రెండున్నరేళ్ళు గడుస్తున్నా అమలు కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు.ఉద్యోగ,ఉపాధి అవకాశాల్లో వికలాంగులకు 5శాతం రిజర్వేషన్‌ను సమర్థవంతంగా అమలు చేయాలని కోరారు.డిమాండ్లు పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా దివ్యాంగులను ఐక్యం చేసి రిలే దీక్షలు, ధర్నాల తో దశలవారీ ఉద్యమాలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.జగిత్యాల నుండే ఉద్యమానికి శ్రీకారం చుట్టి రాష్ట్రవ్యాప్తంగా జైత్రయాత్ర చేపడతామని తెలిపారు.

## నూతన కార్యవర్గాన్ని అభినందించిన ఎమ్మెల్యే



**చురకలు విలేకరి,జగిత్యాల, సెప్టెంబర్ 3 :** నూతనంగా ఎన్నికైన జగిత్యాల జిల్లా పీఆర్టీయూటీఎస్ నూతన కార్యవర్గ సభ్యులు గురువారం జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నూతన కార్యవర్గాన్ని అభినందించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు యాల్ల అమర్నాథ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి బోయినపెల్లి ఆనంద్ రావు, అసోసియేట్ అధ్యక్షులు నవీన్,శ్రీదేవి,ఉపాధ్యక్షులు రాజేందర్,ప్రశాంత్, శ్రీనివాస్, కార్యదర్శులు లక్ష్మణ స్వామి,ఉమేష్,శివ కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రంథాలయానికి టేబుళ్లు,కుర్చీలు అందజేత



**చురకలు ప్రతినిధి కోరుట్ల, సెప్టెంబర్ 03 :** పట్టణంలో స్వచ్ఛందంగా నిర్వహిస్తూ ఉచిత కోచింగ్ అందిస్తున్న సి. ప్రభాకర్ స్మారక గ్రంథాలయానికి గురువారం కోరుట్ల ఎల్ఐసీ బ్రాంచ్ మేనేజర్ కే. మోహన్ కృష్ణ, చీఫ్ అడ్వైజర్ ఏలేటి లక్ష్మణ్ రెడ్డి టేబుళ్లు కుర్చీలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రంథాలయం మరింత అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని విద్యార్థులకు ఉపయోగపడేలా మరిన్ని మంచి కార్యక్రమాలు నిర్వహించాలని ఆకాంక్షించారు. గ్రంథాలయం ద్వారా విద్యార్థులకు ఉచిత కోచింగ్ అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సి.ప్రభాకర్ స్మారక గ్రంథాలయం అధ్యక్షులు రాస భూమయ్య, ఏఐటీయూసీ కార్మిక సంఘాల అధ్యక్షుడు సుతారి రాములు,అడ్వకేట్లు బెజ్జారపు ప్రేమ్ సాగర్, ఓటరుకారి శ్రీనివాస్,మరిపెల్లి గంగాధర్,శ్రీహరి,ఏకీపూర్ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు ఆదర్శంగా లక్ష్మీపూర్ సహకార సంఘం

### -జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, సెప్టెంబర్ 3 :** రైతులకు లక్ష్మీపూర్ సహకార సంఘం ఆదర్శంగా నిలవాలని జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ అన్నారు. జగిత్యాల రూరల్ మండలం లక్ష్మీపూర్ సహకార సంఘం నూతన కార్యవర్గ సభ్యులు గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు ఆదర్శంగా లక్ష్మీపూర్ సహకార సంఘం నిలవాలన్నారు. క్లిష్ట పరిస్థితుల్లోనూ రాష్ట్ర ప్రభుత్వం మొక్కజొన్న కొనుగోలు చేసిందని, సివిల్ సప్లైస్, మార్క్ ఫెడ్ లో లక్ష కోట్ల అప్పు ఉందని, ప్రతి ఏటా 11 వేల కోట్ల వడ్డీ ప్రభుత్వం చెల్లిస్తోందని తెలిపారు. మిల్లర్ల నుండి రావాల్సిన బియ్యం రాకపోవడంతో విజిలెన్స్ తనిఖీలు చేపట్టారన్నారు. ములుకనూరు సొసైటీ తరహాలో రైతు సహకార సంఘాలు అభివృద్ధి చెందాలని,కో-ఆపరేటివ్ సొసైటీలు, ఎఫ్పీవోలు బలోపేతం కావాలని, ప్రభుత్వం తరపున తన తరపున సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. మూస పద్ధతిలో వరి సాగు వద్దని, డిమాండ్ ఉన్న కూరగాయల పంటలు వేయాలని సూచించారు. ఏకకాలంలో 21వేల కోట్ల రుణమాఫీ చేయడం చరిత్ర అని, ప్రతిపక్ష నేతల కుటుంబాలకు కూడా రుణమాఫీ అయ్యిందన్నారు.ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షులు సంగెపు తిరుపతిరెడ్డి, ఉపాధ్యక్షులు గోస్కుల మహేష్, డైరెక్టర్లు, మాజీ ఏఎంసి చైర్మన్ నక్కల రవీందర్ రెడ్డి, ఉప సర్పంచ్ సత్తిరెడ్డి, మాజీ సర్పంచ్ చెరుకుజాన్, నాయకులు రాజేశ్వర్ రెడ్డి, సర్పంచులు మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడితే కఠిన చర్యలు

### -కోరుట్ల మున్సిపల్ ఇంచార్జ్ కమిషనర్ అరుణ్ కుమార్ హెచ్చరిక



**చురకలు ప్రతినిధి కోరుట్ల సెప్టెంబర్ 03 :** పట్టణంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తి స్థాయిలో నిషేధించాలని కోరుట్ల మున్సిపల్ ఇంచార్జ్ కమిషనర్ అరుణ్ కుమార్ ఆదేశించారు.ఆయన ఆదేశాల మేరకుమున్సిపల్ సిబ్బంది పట్టణంలోని బిర్యానీ సెంటర్లు, టిఫిన్ సెంటర్లు, స్వీట్ హౌస్‌లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.ఈ తనిఖీల్లో వ్యాపారులు వినియోగిస్తున్న సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను స్వాధీనం చేసుకుని నిబంధన లు ఉల్లంఘించిన వారికి మొత్తం రూ.30 వేల జరిమానా విధించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై వ్యాపారులకు అవగా హన కల్పించారు. అలాగే ట్రేడ్ లైసెన్స్ రెన్యువల్ చేసుకోని దుకాణదారులు వెంటనే లైసెన్స్‌ను రెన్యువల్ చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఇంచార్జ్ కమిషనర్ అరుణ్ కుమార్ మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తి స్థాయిలో నిషేధించాలని నిబంధనలు ఉల్లంఘిస్తే భారీగా జరిమానాలు విధించడంతో పాటు అవసరమైతే దుకాణాలను సీజ్‌చేస్తామని హెచ్చ రించారు.ట్రేడ్ లైసెన్స్‌లేని వ్యాపారులు వెంటనే లైసెన్స్ తీసుకోవాలని సూచించారు. వ్యాపార కార్యకలాపాల ద్వారా వెలువడే చెత్తను తడి పొడి హానికర చెత్తగా వేరు చేసి దుకాణాల వద్దకు వచ్చే మున్సిపల్ పారిశుధ్య వాహనాలకు అందించాలని తెలిపారు. చెత్తను నిబంధనలకు విరుద్ధంగా పారవేస్తే ఎస్‌డబ్ల్యూఎం-2026 నిబంధనల ప్రకారం జరిమానా విధిస్తా మని హెచ్చరించారు.ఈ తనిఖీల్లో శానిటరీ ఇన్‌స్పెక్టర్ అశోక్,రికార్డ్ అసిస్టెంట్ జగదీష్,వార్డు ఆఫీసర్ వెంకటేష్,రాజుతో పాటు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



# విద్యా సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలి

### -విద్యార్థులకు బూట్ల పంపిణీ కార్యక్రమంలో -సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు కాశిరెడ్డి భాస్కర్ రెడ్డి



**చురకలు విలేకరి ఇబ్రహీంపట్నం సెప్టెంబర్ (03) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న విద్యా సౌకర్యాలను విధ్యర్దులు సద్వినియోగం చేసుకోవాలని జగిత్యాల జిల్లా ఇబ్రహింపట్నం మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు కాశిరెడ్డి భాస్కర్ రెడ్డి అన్నారు. ఇబ్రహీంపట్నం మండలంలోని అమ్మక్కపేట గ్రామంలో గురువారం విద్యార్థులకు బూట్లను పంపిణీ చేశారు.ఈసందర్భంగా కాశిరెడ్డి భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం అనేక విద్యా సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తూ వారి చదువుకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు.ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు బూట్లు, యూనిఫాం తదితర సౌకర్యాలు అందించడం ద్వారా పేద, మధ్యతరగతి కుటుంబాలపై ఆర్థిక భారం తగ్గుతుందన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అవసరమైన మౌలిక సదుపాయాలు అందితే వారు విద్యలో మరింత ప్రతిభ కనబరుస్తారని అన్నారు. పాఠశాలల అభివృద్ధికి, విద్యార్థుల సంక్షేమానికి తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు.విద్యార్థులకు బూట్ల పంపిణీ చేయడం పట్ల ఉపాధ్యాయులు, విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు చంద్రశేఖర్, సత్యవతి, రాధిక, గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఆటో ఢీకొని వ్యక్తి మృతి



**చురకలు విలేకరి ఇబ్రహీంపట్నం సెప్టెంబర్ (03) :** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలోని మేడిపల్లి గ్రామ సమీపంలో 63వ జాతీయ రహదారిపై సెప్టెంబర్ 1న జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు.పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం మండలం లోని గోదురు గ్రామానికి చెందిన బోదాసు చిన్నరాజు 35 మేడిపల్లిలో గది అద్దెకు తీసుకుని తన రెండో భార్య రాధతో కలిసి నివాసం ఉంటూ కూలి పని చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఈ నెల 1న రాత్రి జాతీయ రహదారిపై వెళ్తుండగా ఆటో ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు.మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఇబ్రహీంపట్నం ఎస్ ఐ నవిన్ కుమార్ తెలిపారు.ఫైన్కల ప్రసాద్ పై కేసు నమోదు చేశారు.

## హరి అశోక్ కుమార్‌కు నంది పురస్కారం



**చురకలు విలేకరి,జగిత్యాల, సెప్టెంబర్ 3 :** జగిత్యాల జిల్లా కేంద్రం లో సీనియర్ సిటిజెన్స్, పెన్షనర్స్ జిల్లా అధ్యక్షులుగా పిల్లల నిరాధరణ కు గురైన వృద్ధులకు సేవలందిస్తున్న, ఇటీవల పొగాకు నియంత్రణకు విశేషం గా కృషి చేస్తూ టుబాకో కంట్రోల్ హీరో అవార్డు పొందిన వివిధ సమాజ సేవలు చేస్తున్న రిటైర్డ్ తహసీల్దార్,న్యాయవాది హరి అశోక్ కుమార్‌కు తెలంగాణ సాంస్కృతిక శాఖ సహకారం తో గానకోకిల కళానికేతన్ జగిత్యాల 34 వ వార్షికోత్సవ వేడుకల సందర్భంగా నంది పురస్కారంను ఆ సంస్థ ప్రకటించింది.ఇట్టి పురస్కారంను నేడు సెప్టెంబర్ 4న శుక్రవారం ఉమాశంకర్ గార్డెన్స్ జగిత్యాల పట్టణంలో సాయంత్రం జరిగే వార్షికోత్సవ వేడుకల్లో రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ చేతుల మీదుగా హరి అశోక్ కుమార్ కు నంది పురస్కారం ను ప్రధానం చేస్తామని గాన కోకిల కళానికేతన్ వ్యవస్థాపక అధ్యక్షులు ఎలిగేటి రాజేంద్ర ప్రసాద్ ప్రకటించారు.ఈ కార్యక్రమంలో సంస్థ గౌరవ అధ్యక్షులు ఎమ్మెల్సీ ఎల్.రమణ,ఎంపి ధర్మపురి అరవింద్,ఎమ్మెల్యే సంజయ్ కుమార్, మాజీ ఎమ్మెల్సీ టి.జీవన్ రెడ్డి, జగిత్యాల,ధర్మపురి మున్సిపల్ చైర్ పర్సన్ లు సమిండ్ల వాణి,నాగ లక్ష్మి,తదితర జిల్లా ప్రముఖులు పాల్గొంటారని, వారు వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందిస్తున్న వారికి నంది పురస్కారాలు అందజేస్తారని తెలిపారు.

## ఆల్ఫోర్స్‌లో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



**చురకలు విలేకరి, మల్యాల, సెప్టెంబర్ 3 :** మల్యాల ఎక్స్ రోడ్లోని ఆల్ఫోర్స్ పాఠశాలలో కృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకొని ముందస్తు కృష్ణాష్టమి వేడుకలను గురువారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణం కృష్ణుడి లీలలను ప్రతిబింబించేలా ఆహ్లాదకరంగా ముస్తాబైంది. విద్యార్థులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో ముచ్చటగా ముస్తాబై ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. చిన్నారుల వేషధారణలు, వారి చక్కటి ప్రదర్శనలు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా ఆల్ఫోర్స్ పాఠశాల సిబ్బంది ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రంగవల్లికలు అందరినీ ఆకర్షించాయి. అనంతరం సంప్రదాయబద్ధంగా ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా, ఆనందంగా పాల్గొని ఉట్టి కొట్టి వేడుకలను మరింత సందడిగా మార్చారు. ఈ సందర్భంగా పాఠశాల సిబ్బంది మాట్లాడుతూ, విద్యార్థుల్లో భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, పండుగల విశిష్టతను తెలియజేయడంతో పాటు వారిలో సృజనాత్మకత, ఐక్యత, ఉత్సాహాన్ని పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

# 'చలో హైదరాబాద్' మహాధర్నాను జయప్రదం చేయాలి

**-ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి : పాలెపు శివరామకృష్ణ**





**చురకలు ప్రతినిధి కోరుట్ల సెప్టెంబర్ 03 :** ఉద్యోగులు ఉపాధ్యాయులు పెన్షనర్ల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం ప్రభుత్వ హామీల సాధన కోసం తెలంగాణ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ (టీజీఈజేఏసీ)ఆధ్వర్యంలో సెప్టెంబర్ 10న హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో నిర్వహించనున్న 'చలో హైదరాబాద్-ఉద్యోగుల హక్కుల సాధన సభను రాష్ట్రవ్యాప్తంగా విజయవంతం చేయాలని ఎస్టీయూ జగిత్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెపు శివరామకృష్ణ పిలుపునిచ్చారు. గురువారం కోరుట్ల మండలంలో నిర్వహించిన ఎస్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉద్యోగులు ఉపాధ్యాయులు పెన్షనర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.మెరుగైన ఫిట్‌మెంట్ తో రెండో పీఆర్సీ నివేదికను వెంటనే అమలు చేయాలని, ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న ఆరు కరవు భత్యాలను (డీఏ) తక్షణమే విడుదల చేయాలని కోరారు. ఉద్యోగులు పెన్షనర్ల పెండింగ్ బిల్లులను నెలకు కనీసం రూ.2,000 కోట్ల చొప్పున చెల్లించాలని డిమాండ్ చేశారు. కాంట్రిబ్యూటరీ పెన్షన్‌స్కీమ్ (సీపీఎస్)ను పూర్తిగా రద్దు చేసి పాత పెన్షన్ విధానం(ఓపీఎస్)ను పునరుద్ధరించాలని ఉద్యోగుల ఆరోగ్య పథకం (ఎన్ఈహెచ్ఎస్)ను ఎలాంటి లోపాలు లేకుండా సమర్థవంతంగా అమలు చేయాలని కోరారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలతో పాటు పెండింగ్‌లో ఉన్న అన్ని డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని అన్నారు.సెప్టెంబర్ 10న హైదరాబాద్ లో నిర్వహించనున్న మహాధర్నాకు ఉద్యోగులు ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని పాలెపు శివరామకృష్ణ కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ కోరుట్ల మండల శాఖ అధ్యక్షులు సిరిపురం రాజేష్, జిల్లా ఉపాధ్యక్షులు రఫూఫ్, జిల్లా కార్యదర్శి పరందాం తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

**-కృష్ణుడి వేషధారణలో అలరించిన విద్యార్థులు**
**-భక్తిశ్రద్ధలతో ప్రత్యేక కార్యక్రమాలు**



**చురకలు విలేకరి ఇబ్రహీంపట్నం సెప్టెంబర్ (03) :** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని గోదూర్,తిమ్మాపూర్,తిమ్మాపూర్ తండ, యామాపూర్, ఫకిర్ కోండాపూర్, వేములకుర్తి, బర్దిపూర్, ములరాంపూర్, ఎర్దండి ,కోమటికొండాపూర్, వర్షకోండ, డబ్బ, ఎర్రాపూర్, అమ్మకపేట్, ఇబ్రహీంపట్నం,కేశాపూర్, కోజన్ కోత్తూర్ గ్రామలలని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో గురువారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా పాఠశాలలను ప్రత్యేకంగా అలంకరించి, శ్రీకృష్ణుడు,రాధ, గోపికల వేషధారణలో విద్యార్థులు పాల్గొని అందరినీ ఆకట్టుకున్నారు.విద్యార్థులు శ్రీకృష్ణుడి బాల్య లీలలు,గోపికలతో రాసక్రీడలు, వెన్న దొంగతనం తదితర ఘట్టాలను ప్రదర్శించారు.చిన్నారులు కృష్ణుడు, రాధ వేషధారణలో ముస్తాబై పాఠశాల ప్రాంగణంలో సందడి చేశారు. కొందరు విద్యార్థులు శ్రీకృష్ణుడి గొప్పతనం, భగవద్గీత బోధనలపై ప్రసంగించారు.ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ శ్రీకృష్ణ జన్మాష్టమి విశిష్టత, శ్రీకృష్ణుడి జీవితం, ధర్మ పరిరక్షణ కోసం ఆయన చేసిన కృషి గురించి విద్యార్థులకు వివరించారు. భగవద్గీతలోని ముఖ్యమైన సందేశాలను విద్యార్థులకు తెలియజేశారు. పండుగలను నిర్వహించడం ద్వారా విద్యార్థుల్లో మన సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన పెరుగుతుందన్నారు.పాఠశాలల్లో విద్యార్థులు నిర్వహించిన నృత్యాలు, పాటలు, శ్లోక పఠనం, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.విద్యార్థులకు స్వీట్లు, ప్రసాదం పంపిణీ చేశారు.చిన్నారులు ఉత్సాహం గా పాల్గొనడంతో పాఠశాలల్లో పండుగ వాతావరణం నెలకొంది. ఈకార్యక్రమా ల్లో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత



**చురకలు విలేకరి, రాయికల్, సెప్టెంబర్ 3 :** పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని సర్పంచ్ మ్యాకల మల్లేశం అన్నారు.గురువారం రాయికల్ మండలం కుర్మపల్లి ప్రాథమిక పాఠశాల ఆవరణలో "ఏక్ పేడ్ మా కే నామ్" అంటే పిల్లలు,తల్లి కలిసి రెండు మొక్కలు నాటే కార్యక్రమముకు ప్రారంభించారు.మన అవసరాల కోసం అడవిలో ఉన్న చెట్లను నరికి వేయడం, ప్లాస్టిక్ వినియోగం, సెల్ టవర్స్ రేడియేషన్, ఫ్యాక్టరీ నుండి వచ్చే వ్యర్థ పదార్థాలు,వాయువు కాలుష్యం పెరిగి పోవడంతో వాతావరణ కాలుష్యం పెరిగి ఎల్ నినో ఎఫెక్ట్ ఏర్పడడం ఒక కారణం అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ పుల్ల లతమల్లేష్, ప్రధానోపాధ్యాయులు ఎలిగట్టటి రాజకిశోర్, ఉపాధ్యాయులు వోడ్నాల ప్రియాంక, విద్యార్థుల తల్లిదండ్రులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

### వెయ్యి రోజుల...

## కాంగ్రెస్ పాలన అభివృద్ధి శూన్యం



**-కోరుట్ల ఎమ్మెల్యే డా.కల్వకుంట్ల సంజయ్**

**చురకలు విలేకరి, మల్లాపూర్, సెప్టెంబర్ 3 :** వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనలో ఎక్కడ కూడా అభివృద్ధి శూన్యమని కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ కాంగ్రెస్ ప్రభుత్వ పరిపాలనను విమర్శించారు. గురువారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు భరతమాత కూడలి వద్ద బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో కోరుట్ల ఎమ్మెల్యే పాల్గొని కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులవుతున్న ప్రజలకు ఇచ్చిన 420 హామీలను నెరవేర్చకుండా మోసం చేస్తూ సీఎం రేవంత్ రెడ్డి నీచ రాజకీయాలు చేస్తున్నారన్నారు. పంటలను పండించడానికి రైతులకు కనీసం యూరియాను కూడా అందుబాటులో ఉంచకుండా రైతులను పట్టించుకున్న పాపాన పోలేదని ప్రభుత్వం పై ఆయన విమర్శించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి దిష్టిబొమ్మ దహనం...బిజెపి శ్రేణుల అరెస్ట్...

**చురకలు విలేఖరి,తిమ్మాపూర్ సెప్టెంబర్ 03 :** నల్గొండ జిల్లా కేంద్రంలో బీజేపీ కార్యాలయం,తో పాటు జిల్లా అధ్యక్షుడు డా. నాగం వర్షిత్ రెడ్డి నివాసంపై కాంగ్రెస్ శ్రేణులు దాడి చేసి , ఈ సందర్భంగా కార్యాలయంలో ఉన్న ప్రముఖ ఆధ్యాత్మిక గురువు, సామాజిక సంస్కర్త సంత్ రవిదాస్ చిత్రపటంపై నల్ల సిరా చల్లడాన్ని నిరసిస్తూ బిజెపి ఎస్సీ మోర్చా రాష్ట్ర శాఖ పిలుపుమేరకు గురువారం రోజున కరీంనగర్ జిల్లావ్యాప్తంగా బీజేపీ ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో అన్ని మండల కేంద్రాలలో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేసి , ముఖ్యమంత్రి దిష్టిబొమ్మను దహనం చేశారు. పలు ప్రాంతాల్లో బిజెపి నేతలను పోలీసులు అరెస్టు చేశారు. చొప్పదండి కేంద్రంలో జరిగిన నిరసన కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాయిని మల్లేశం మాట్లాడుతూ కాంగ్రెస్ సర్కార్ గుండాగిరి , దౌర్జన్యాలకు పాల్పడుతుందని , దీనికి తగిన



మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. నల్గొండ బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి నివాసంలోకి కాంగ్రెస్ గుండాలు చొరబడి వస్తువులన్నీ ధ్వంసం చేయడమే కాకుండా ఆ సమయంలో ఇంట్లో ఉన్న వర్షిత్ రెడ్డి తల్లిపై కూడా భౌతిక దాడి చేయడంతో ఆమెకు గాయాలపాలై గుండెపోటు కూడా గురైందన్నారు. అంతేకాకుండా దాడుల సమయంలో కార్యాలయంలో ఉన్న మహనీయులు సంత్ రవిదాస్ జీ చిత్రపటంపై కాంగ్రెస్ దుండగులు నల్ల రంగు చల్లి ,ఆ మహనీయునీ ఇలా అవమానించడం తగదన్నారు . దళిత సమాజం , సమాజంలోని అన్ని వర్గాల మనోభావాలను కాంగ్రెస్ తీవ్రంగా గాయపరిచిందన్నారు. సంత్ రవిదాస్ చిత్రపటాన్ని అవమానించిన వారిపై సమగ్ర విచారణ జరిపి, చట్ట నిబంధనల ప్రకారం ఎస్సీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా నిందితులందరినీ తక్షణమే అరెస్ట్ చేయాలని ఆయన ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. . కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ హక్కులను కాలరాస్తోందని, దాడులు చేసిన వారిని వదిలేసి పరామర్శించడానికి వెళ్తున్న బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు ను అరెస్టు చేయడం పై ఆయన మండిపడ్డారు.

**తిమ్మాపూర్ లో దిష్టిబొమ్మ దహనం...**

బిజెపి తిమ్మాపూర్ ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో మండల కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వం దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి, మండల అధ్యక్షులు చింతం శ్రీనివాస్ ,ఎస్సీ మోర్చా మండల అధ్యక్షులు ఎలుకపెల్లి స్వామి , జిల్లా అధికార ప్రతినిధి బొంతల కళ్యాణ్ చంద్ర, జిల్లా ఈసీ మెంబర్ బుట్ల శ్రీనివాస్, ముష్వరపు సంపత్ మండల జనరల్ సెక్రెటరీ గొట్టిముక్కల తిరుపతిరెడ్డి, కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు బోనాల మోహన్ ,బీజేవైఎం మండల అధ్యక్షులు గడ్డం అరుణ్, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షులు దుర్శేడ్ రమేష్ సీనియర్ నాయకులు తమ్మన వేణి రాజు యాదవ్ ,బుర్ర శ్రీనివాస్ గౌడ్ ,వరకోలు సమ్మయ్య ,వేల్పుల ఓదేలు జంగా సునీల్ రెడ్డి ,జాడి రాజు, ప్రదీప్ రెడ్డి ,హరిదాస్ ,పాశం అజయ్, అనిల్ ,అజయ్ లతో పాటు కార్యకర్తలు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ బలోపేతం చేస్తా

**-మంత్రి శ్రీధర్ బాబు నాయకత్వంలో మరోసారి బాధ్యతలు**

**-ఘనంగా సత్కరించిన మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తిరుపతి యాదవ్**



**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ సెప్టెంబర్ 3 :** కమాన్‌పూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ఎస్.ఎస్. అన్వర్ మరోసారి నియమితులయ్యారు. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు నాయకత్వంలో ఆయనకు వరుసగా రెండోసారి ఈ బాధ్యతలు దక్కాయి. పార్టీ కోసం చేసిన సేవలకు గుర్తింపుగా అధిష్ఠానం మళ్లీ ఆయనకే పగ్గాలు అప్పగించడంతో మండల కాంగ్రెస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి. ఈ సందర్భంగా రామగిరి మండలం బేగంపేట్ ఎక్స్ రోడ్డులోని మంథని బ్లాక్ కాంగ్రెస్ కార్యాలయంలో నూతన అధ్యక్షుడు అన్వర్‌ను మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తొట్ల తిరుపతి యాదవ్ శాలువాతో సత్కరించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి శ్రీధర్ బాబు ఆశయాలకు అనుగుణంగా, రానున్న రోజుల్లో క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి మరింత చిత్తశుద్ధితో పని చేయాలని ఆయన ఆకాంక్షించారు. అందరినీ కలుపుకుపోతూ కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) ఉపాధ్యక్షులు ఎల్ల రామ్మూర్తి, కార్యదర్శి రోడ్డ బాపన్న, కమాన్‌పూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గూగులోత్ ప్రవీణ్ నాయక్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు అంబీర్ శీను, గొల్లపల్లి రాజమల్లు, యూత్ కాంగ్రెస్ నాయకులు భోగే ప్రకాష్, చక్రి, రామగిరి మండలం ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు మోత్కూరి నవీన్ గౌడ్, శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ కార్యాలయంపై కాంగ్రెస్ శ్రేణుల దాడి గర్హనీయం

**-బిజెపి పట్టణ అధ్యక్షులు తూర్పాటి రాజు**

**-హుజురాబాద్‌లో బిజెపి ఆందోళన**

**చురకలు ప్రతినిధి హుజురాబాద్, సెప్టెంబర్ 3 :** బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై కాంగ్రెస్ శ్రేణుల దాడిని,సంత్ రవిదాస్ గారి చిత్రపటం పై నల్లరంగు పూయడాన్ని ఖండిస్తూ గురువారం హుజురాబాద్ అంబేద్కర్ చౌరస్తాలో బీజేపీ ఎస్సీ మోర్చా అధ్యక్షులు ఎర్ర శ్రీధర్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించి సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా బిజెపి నాయకులు మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజకీయ భేదాభిప్రాయాలు సాధారణమని కానీ ప్రత్యర్థుల కార్యాలయాలపై దాడులకు పాల్పడటం దారుణమని అన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై జరిగిన దాడి ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని, ఇలాంటి దాడులను భారతీయ జనతా పార్టీ తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. గురు సంత్ రవిదాస్ చిత్రపటంపై నల్లరంగు పూయడం అత్యంత హేయమైన చర్య అని అభివర్ణించారు. ఇది ప్రజల మనోభావాలను అవమానించడమేనని,దాడికి పాల్పడిన వారిపై ప్రభుత్వం,పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉందనే అహంకారంతో ప్రతిపక్ష పార్టీ



నాయకులు,కార్యకర్తలను భయభ్రాంతులకు గురిచేసే ప్రయత్నాలను సహించేది లేదని నాయకులు స్పష్టం చేశారు. ప్రజా స్వామ్య పరిరక్షణ, ప్రజల సంక్షేమం కోసం భారతీయ జనతా పార్టీ నిరంతరం పోరాడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ బిజెపి పట్టణ అధ్యక్షులు తూర్పాటి రాజు, జిల్లాకౌన్సిల్ మెంబర్ రావుల వేణు, సెంట్రల్ ఫిలిం సెన్సార్ బోర్డ్ మెంబర్ సబ్బని రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలల్లో ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు



**చురకలు విలేఖరి,తిమ్మాపూర్,సెప్టెంబర్2 :** ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిన్నారులు గోపికమ్మ, కృష్ణులు వేషం వేసి అలరించారు. ఉట్టి కొట్టి ఆనందంగా గడిపారు. మండల కేంద్రంలోని శ్రీ శ్రీనివాస రామానుజన్ ఉన్నత పాఠశాలలలో వేడుకలు ఘనంగా జరిగాయి. కరస్పాండెంట్లు బర్మయ్య,జితేందర్ మాట్లాడుతూ..సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకోవాలని చిన్నారులకు సూచించారు.

# పెద్దపల్లి జిల్లాలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు వీరే

**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ సెప్టెంబర్ 3 :** పెద్దపల్లి జిల్లాలోని మండల కాంగ్రెస్ అధ్యక్షుల పదవులను గురువారం పెద్దపెల్లి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్ ఠాకూర్ టిపిసిసి అధ్యక్షుడు మహేష్ గౌడ్ ఆదేశాల మేరకు ప్రకటించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుల వివరాలు ఇలా ఉన్నాయి. ఐలి ప్రసాద్ మంథని ముత్తారం దొడ్డ బాలాజీ రామగిరి తులసిరామ్ గౌడ్ కమాన్ పూర్ సయ్యద్ పెద్దపల్లి కట్కూరి సుధాకర్ రెడ్డి ఓదెల మూల ప్రేమ్ సాగర్ రెడ్డి కాల్వ శ్రీరాంపూర్ గజవేన సదయ్య సుల్తానాబాద్ సతీష్ వెలిగేడు సామ రాజేశ్వర్ రెడ్డి జూలపల్లి బొజ్జ శ్రీనివాస్ టౌన్ వి అబ్బయ్య పెద్దపల్లి టౌన్ భూతగడ్డ సంపత్ అంతర్గాం సింగం కిరణ్ పాలకుర్తి ముఖ్యర శ్రీనివాస్ ధర్మారం లౌడియ రూట్ల నాయక్ తదితరులను నియమిస్తూ ఆయా మండలాల అధ్యక్షులకు పత్రాలను అందజేశారు.

# ఏఎన్ఎంల సమస్యలు పరిష్కరించాలి




**చురకలు ప్రతినిధి,హనుమకొండ సెప్టెంబర్ 03 :** వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న ఏఎన్ఎం లను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని, పనిభారాన్ని తగ్గించి సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని తెలంగాణ యునైటెడ్ మెడికల్, హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. యాద నాయక్ డిమాండ్ చేశారు. గురువారం CITU ఆధ్వర్యంలో హనుమకొండ కలెక్టరేట్, వరంగల్ కార్యాలయాల ఎదుట ఏఎన్ఎంలు నిరసన ధర్నా నిర్వహించారు. అనంతరం హనుమకొండ డిఎంహెచ్ఓ డాక్టర్ అప్పయ్య, వరంగల్ డిఎంహెచ్ఓ డాక్టర్ బి. రాజారెడ్డిలకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా యాద నాయక్ మాట్లాడుతూ ఏఎన్ఎంల ప్రధాన డిమాండ్లను ప్రస్తావించారు. ఉద్యోగ భద్రత,వేతనాలు,కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఏఎన్ఎంలకు ఉద్యోగ భద్రత కల్పించి పర్మినెంట్ చేయాలి. వేతనాలు పెంచి,రిటైర్మెంట్ బెనిఫిట్స్ వర్తింపజేయాలి. పని ఒత్తిడి తగ్గింపు,ఒకేసారి ఆఫ్ లైన్, ఆన్ లైన్ నమోదు విధానం వల్ల ఏఎన్ఎంలు మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. ఇబ్బందులకు గురిచేస్తున్న 'ఆభా (ABHA) లింకింగ్' విధానాన్ని తక్షణమే రద్దు చేయాలి. ఇంక్రిమెంట్లు, ప్రమోషన్లు, ప్రభుత్వ ఖర్చుతో ఎల్ హెచ్ వి (LHV) ట్రైనింగ్ ఇప్పించాలి. ట్రైనింగ్ పూర్తయ్యే వరకు పెండింగ్ లో ఉన్న 12, 18 సంవత్సరాల స్పెషల్ ప్రమోషనల్ పోస్ట్ (SPP) ఇంక్రిమెంట్లను విడుదల చేయాలి. అర్హులైన వారికి సూపర్ వైజర్ ప్రమోషన్లు ఇవ్వాలి. గత మూడేళ్లుగా పెండింగ్ లో ఉన్న 1931 APHA (ఫిమేల్) పోస్టులతో పాటు శాఖలోని అన్ని ఖాళీలను వెంటనే భర్తీ చేయాలి. క్షేత్రస్థాయి ఏఎన్ఎంల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు, పోరాటాలు చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమాల్లో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జిల్లపల్లి సుధాకర్, నాయకులు కే. సరోజ, పద్మ, సదాలక్ష్మి, భారతి, స్వరూప, రూపాలత, ఆదిలక్ష్మి, రేణుక, సబిత, లావణ్య, పూలమ్మ, అరుణదేవి, దాసరి నర్మద, సంధ్యారాణి, రాజేశ్వరి, బి. జ్యోతి, టి. విజయ, జయమని, ఆర్. అనిత, పెనినా, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

## కానిస్టేబుల్ పోస్టుల దరఖాస్తుల చివరి తేదీని పొడిగించండి

**-ఆశావాహుల విజ్ఞప్తి**

**చురకలు ప్రతినిధి హుజురాబాద్ సెప్టెంబర్ 3 :** రాష్ట్రంలో 7వేలకు పైగా కానిస్టేబుల్ పోస్టులకు రాష్ట్ర ప్రభుత్వం, పోలీసు రిక్రూట్మెంట్ బోర్డ్ నోటిఫికేషన్ విడుదల చేసింది. అయితే దరఖాస్తులు సమర్పించేందుకు సెప్టెంబర్ తొమ్మిదిని చివరి తేదీగా ప్రకటించారు. కానీ చాలామంది నిరుద్యోగులు కానిస్టేబుల్ పోస్టులకు సుదీర్ఘకాలంగా సన్నద్ధమవుతున్నారు. ఇందుకు సంబంధించి కుల ఆదాయ ధ్రువీకరణ పత్రాలు ఆయా కార్యాలయాల నుండి తీసుకోవాల్సి ఉంది. అలాగే ఇంకా చాలామంది యువతకు నిరుద్యోగులకు నోటిఫికేషన్ సమాచారం కూడా అందలేదు. వీటన్నింటిని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం దరఖాస్తులు సమర్పించేందుకు చివరి తేదీని మరో 20 రోజులపాటు పొడిగించాలని, తద్వారా నిరుద్యోగులకు న్యాయం చేయాలని ఆశావహులతో పాటు హోంగార్డులు, హోంగార్డుల అసోసియేషన్ విజ్ఞప్తి చేస్తోంది. ప్రభుత్వం వెంటనే స్పందించి పోలీసు ఉద్యోగాల నోటిఫికేషన్ దరఖాస్తులు సమర్పించేందుకు గడువు తేదీని మరికొన్ని రోజులపాటు పొడిగించాలని వారు కోరుతున్నారు.

## కమాన్‌పూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షునిగా అన్వర్



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ సెప్టెంబర్ 3 :** కమాన్‌పూర్ మండల కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షులుగా మండల కేంద్రానికి చెందిన సయ్యద్ సయీద్ అన్వర్ ను నియమించినట్లు పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ వెల్లడించారు. అన్వర్ మండల అధ్యక్షునిగా రెండోసారి పగ్గాలను చేపట్టారు.కాగా అన్వర్ గతంలో జిల్లా ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు.ప్రస్తుతం పార్టీ బలోపేతం కి కృషి చేస్తూ మంత్రి శ్రీధర్ బాబు కు అండగా ఉంటున్నాడు. తనకు పదవి మళ్ళీ రావడానికి కారకులైన రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబుకు, పీసీసీ ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శీను బాబుకు,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తొట్ల తిరుపతి యాదవ్ కు కృతజ్ఞతలు తెలిపారు.అన్వర్ నియామకం పట్ల కాంగ్రెస్ నాయకులు ఉప సర్పంచ్ రఫిక్ సోహెల్,అంబిరి శ్రీనివాస్,ఏం సి డైరెక్టర్ రఫీక్,మల్యాల మహేష్, కిషన్ రెడ్డి,పంజా సాయిరాం గౌడ్,సయ్యద్ ఇక్బాల్, ఇనగంటి చిన్నారావు,పిల్లి శేఖర్,చాట్ల రాయమల్లు,బూస శ్రీనివాస్, మైనార్టీ కాంగ్రెస్ నాయకుడు మేహరాజ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## హుజురాబాద్‌లో కాంగ్రెస్ ప్రజాపాలన విజయోత్సవ ర్యాలీ

**-హుజురాబాద్ అభివృద్ధి కాంగ్రెస్ తోనే సాధ్యం**



**చురకలు ప్రతినిధి హుజురాబాద్ సెప్టెంబర్ 3 :** రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలన వేయి రోజులు పూర్తయిన సందర్భంగా హుజురాబాద్ పట్టణంలో విజయోత్సవ ర్యాలీలు గురువారం ఘనంగా నిర్వహించారు.స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుండి కార్యకర్తలు అంబేద్కర్ చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించి, బాణాసంచా కాల్చి కేక్ కట్ చేశారు. అనంతరం హుజురాబాద్ అంబేద్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ..ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ముందుకు వెళ్తుందని హుజూరాబాద్ అభివృద్ధికి నియోజకవర్గ ఇన్చార్జి ప్రణవ్ బాబు నిత్యం మంత్రులతో,అధికారులతో మాట్లాడి నిధులు తీసుకొస్తున్నారని, ఇక్కడ ప్రజల ఓట్లతో గెలిచి వారి అభివృద్ధిని పట్టించుకోకుండా కౌశిక్ రెడ్డి అభివృద్ధి నిరోధకుడిగా మారాడని ఆగ్రహం వ్యక్తంచేశారు.హుజురాబాద్ అభివృద్ధి కేవలం కాంగ్రెస్ పార్టీ, ప్రణవ్ బాబుకే సాధ్యమని అన్నారు. ఎన్నికల్లో గెలిచిన తర్వాత కౌశిక్ రెడ్డి హుజురాబాద్ కు సున్నా నిధులు తీసుకొచ్చారని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ సుహాసిని, వైస్ చైర్ పర్సన్ అంజలి, కౌన్సిలర్లు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం చేసింది ఏమీ లేదు

**-బిఆర్ఎస్ నేత పూదరి నరేష్**



**చురకలు ప్రతినిధి హుజురాబాద్ సెప్టెంబర్ 3 :** రాష్ట్రంలో 1000 రోజులు పాలన పూర్తి చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం చేసింది ఏమీ లేదని బి ఆర్ ఎస్ సీనియర్ నేత పూదరి నరేష్ విమర్శించారు.గురువారం శంకరపట్నం మండల కేంద్రంలో బి ఆర్ ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ర్యాలీ ధర్నా రాస్తారోకో నిర్వహించారు.ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ నాయకుడు పూదరి నరేష్ మాట్లాడుతూ..ఏమైనా తిన్నారా కాంగ్రెస్ చేసిందేమీ లేదని విమర్శించారు.ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ సాధ్య మైందని,అలాగే రాష్ట్రాన్ని పదేళ్లపాటు అభివృద్ధి చేశారని గుర్తు చేశారు. కెసిఆర్ పాలనలో రాష్ట్రం అని రంగాల్లో అభివృద్ధి సాధించిందని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు,విద్యుత్ కోతలు లేకుండా చేయడం, ధాన్యం కొనుగోలు, విత్తనాలు ఎరువులు కొరత లేకుండా చేయడం, రైతుబంధు, రైతు బీమా, మిషన్ కాకతీయ ధరణి వంటి ఎన్నో కార్యక్రమాలు రైతుల కోసం చేశారని గుర్తు చేశారు. అలాగే విద్య వైద్య రంగాలతో పాటు మౌలిక సదుపాయాలు అభివృద్ధి చేశారని రాష్ట్రా నికి కీర్తి ప్రతిష్టలు తీసుకు వచ్చారని అన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యం లోని కాంగ్రెస్ ప్రభుత్వ పాలన పూర్తిగా అవినీతి మయ మైందని విమర్శించారు.ఎన్నికల మేనిఫెస్టో ఇచ్చిన అవకాశం కూడా అమలు కాలేదని మండిపడ్డారు. ప్రజ లంతా మళ్ళీ కెసిఆర్ వైపు బి ఆర్ ఎస్ వైపు చూస్తున్నారని అన్నారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు పూదరి నరేష్,మాడ రాజిరెడ్డి, మొక్కి రాల కిషన్ రావు,గుర్రం వెంకటేష్, గుర్రం మహేష్, పూదరి రాజు, గంట రాజు,గరిగి రవి,పురుషోత్తమరావు, నర్సింగ్,సాగర్ తదితరులు పాల్గొన్నారు.

# వేములవాడలో నూతన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ప్రారంభం

**-ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత సులభంగా, వేగంగా అందించడమే ప్రభుత్వ లక్ష్యం**

**-ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**



**చురకలు ప్రతినిధి సిరిసిల్ల సెప్టెంబర్ 03 :** ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత సులభంగా, వేగవంతంగా అందించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు.ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రభుత్వ కార్యాలయాల్లో మెరుగైన మౌలిక వసతులు కల్పిస్తూ సేవలను ప్రజలకు మరింత చేరువ చేస్తున్నామని తెలిపారు.వేములవాడ పట్టణంలోని మార్కెట్ యార్డులో నూతనంగా ఏర్పాటు చేసిన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని గురువారం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం కార్యాలయాన్ని పరిశీలించి అక్కడ అందుబాటులో ఉన్న సౌకర్యాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రిజిస్ట్రేషన్ సేవల కోసం ప్రజలు కార్యాలయాలకు వచ్చినప్పుడు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా సౌకర్య వంతమైన వాతావరణం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. నూతన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం అందుబాటులోకి రావడంతో వేములవాడ ప్రాంత ప్రజలకు రిజిస్ట్రేషన్ సేవలు మరింత సులభతరం కానున్నాయని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అవసరమైన ప్రభుత్వ సేవలను వారి సమీపంలోనే అందించేందుకు చర్యలు తీసుకుంటోందని ఆది శ్రీనివాస్ తెలిపారు.వేములవాడ నియోజకవర్గంలో వివిధ ప్రభుత్వ కార్యాలయాలకు అవసరమైన మౌలిక వసతులు, సౌకర్యాలను కల్పించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా సేవలు అందేలా కృషి చేస్తున్నామని చెప్పారు.ప్రజలకు మెరుగైన పాలన అందించడంతో పాటు ప్రభుత్వ కార్యాలయాల పనితీరును మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రజల అవసరాలను తీర్చడమే ప్రభుత్వ ధ్యేయం అని ప్రభుత్వ విప్ తెలిపారు.

### వినాయక నిమజ్జన ఏర్పాట్లకు 9.75 లక్షలు,

# సద్దుల బతుకమ్మ దసరా ఉత్సవాలకు 27.50 లక్షలు

**-హుజురాబాద్ మునిసిపల్ కౌన్సిల్ తీర్మానం**



**చురకలు ప్రతినిధి హుజురాబాద్ సెప్టెంబర్ 3 :** హుజురాబాద్ మునిసిపల్ కౌన్సిల్ సమావేశం చైర్ పర్సన్ సుహాసినీ రోంటాల అధ్యక్షతన గురువారం జరిగింది. ఇందులో 30 అంశాలకు తీర్మానం ఆమోదించారు. వినాయక నిమజ్జన ఏర్పాట్లకు సాధారణ నిధుల నుండి రూ. 9.75 లక్షలు, సద్దుల బతుకమ్మ, దసరా పండుగల నిర్వహణ కొరకు రూ. 27.50 లక్షలు కేటాయిస్తూ తీర్మానించారు. వర్షాకాలము దృష్ట్యా లీకేజీలు, రిపేర్లు, ఫ్లడ్ డ్యామేజీలను వెంటనే రిపేర్లు చేయుటకు అత్యవసర సిబ్బంది కొరకు ఎమర్జెన్సీ వాహనము ఏర్పాటుకు రూ. 5 లక్షలు కేటాయిస్తూ తీర్మానించారు. 146 మంది పారిశుధ్య ఔట్ సోర్సింగ్ సిబ్బందికి ఇన్సూరెన్స్ కొరకు రూ. 1.46 లక్షలు, డెడ్ బాడీ ఫ్రీజర్ల రిపేర్లు, కొత్త డెడ్ బాడీ ఫ్రీజర్ కొనుగోలుకు రూ. 1.15 లక్షలు, రహదారులలో ఏర్పడిన గుంతలలో మొరం పోయుటకు రూ. లక్ష వివిధ వార్డులలో శిథిలమైన కల్వర్టుల నిర్మాణములకు రూ. 2, లక్షలు వీధి దీపాలు ఏర్పాటు చేయుటకు 15వ ఆర్థిక సంఘ నిధుల నుండి రూ. 10 లక్షలు కేటాయిస్తూ కౌన్సిల్ ఆమోదం తెలిపింది. సమావేశంలో పురపాలక చైర్ పర్సన్ సుహాసినీ రొంటాల, వైస్-చైర్ పర్సన్ గూడూరి అంజలి, వార్డు కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, కమిషనర్ బి. కిషన్, మేనేజర్ ఆర్. భూపాల్ రెడ్డి, టౌన్ ప్లానింగ్ అధికారి జి. అభినవ్, సానిటరీ ఇన్స్పెక్టర్ డి. కిరణ్ గారు, టెక్నికల్ అధికారి శ్రీ నరేష్, జూనియర్ అకౌంట్స్ అధికారి ఎస్. ఆరతి, జూనియర్ అకౌంటెంట్ సి.హెచ్. గోపాల్ రెడ్డి, వ్యవస్థాపన క్లర్కు టి. భవర్ సింగ్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ ఎస్. శ్రీకాంత్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# 25 ఎకరాల్లో శరవేగంగా నిర్మాణ పనులు

**-2,500 మంది విద్యార్థులకు ఆధునిక విద్యా సదుపాయాలు**

**-జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్**



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, సెప్టెంబర్ 3 :** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్‌లో భాగంగా జగిత్యాల నియోజకవర్గానికి మంజూరైన పాఠశాల నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ తెలిపారు. గురువారం తాటిపల్లి శివారులో 25 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ పనులను సంబంధిత అధికారులు,ప్రజాప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్మాణ ప్రదేశాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే సైట్ ఇంజనీర్లతో మాట్లాడి పాఠశాల బ్లాక్, వసతి గృహాలు, క్రీడా మైదానం తదితర నిర్మాణాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సంబంధిత మ్యాప్‌ను పరిశీలించి నిర్మాణ పనుల పురోగతిపై అధికారులతో చర్చించారు. పేద కుటుంబాలకు చెందిన పిల్లలకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు ఒకే ప్రాంగణంలో వసతి, భోజనం, క్రీడలు, నైపుణ్యాభివృద్ధి వంటి సౌకర్యాలు కల్పించడం ఈ పాఠశాలల ప్రధాన ఉద్దేశమని ఎమ్మెల్యే పేర్కొన్నారు.సుమారు 2,500 మంది విద్యార్థులకు ప్రాథమిక స్థాయి నుంచి ఉన్నత విద్య వరకు ఆధునిక, సమగ్ర విద్యా సదుపాయాలు అందుబాటులోకి రానున్నాయని తెలిపారు. విద్యార్థులకు హాస్టల్, భోజనం తదితర వసతి సౌకర్యాలను ప్రభుత్వం కల్పించనుందన్నారు.తెలంగాణ ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ పూర్తయితే జగిత్యాల నియోజకవర్గంలోని పేద, మధ్యతరగతి కుటుంబాల విద్యార్థులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఏ యం సి చైర్మన్ నారాయణ రెడ్డి, సర్పంచులు బొలిశెట్టి గంగారెడ్డి, కట్ట రాజేందర్, మాజీ ఏ యం సి చైర్మన్ నక్కల రవీందర్ రెడ్డి, సదానందం, నలువల సురేశ్, దాసరి సతీష్, లింగారెడ్డి, గడ్డం గంగారెడ్డి,లక్ష్మణ్,శ్రీనివాస్, మహబూబ్, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

# రైతులపై వివక్ష చూపుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం

**-చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకే రవిశంకర్**



**చురకలు విలేకరి, కోడిమ్యాల, సెప్టెంబర్ 3 :** కాంగ్రెస్ ప్రభుత్వం రైతాంగంపై వివక్ష చూపుతోందని, ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ఏ ముఖం పెట్టుకుని ర్యాలీలు చేస్తున్నారని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ప్రశ్నించారు. గురువారం కోడిమ్యాల అంబేద్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనను నిరసిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్నికల ముందు రైతులకు రూ.15 వేల రైతు భరోసా, రూ.2 లక్షల రుణమాఫీ, మహిళలకు రూ.4 వేల పింఛన్, వికలాంగులకు రూ.6 వేల పింఛన్ ఇస్తామని హామీ ఇచ్చి వెయ్యి రోజులైనా అమలు చేయలేదని విమర్శించారు. రైతులకు రూ.15 వేల రైతు భరోసా ఇచ్చి రోడ్డుపైకి రావాలని కాంగ్రెస్ నేతలకు సవాల్ విసిరారు. కోడిమ్యాల మండలంలో ఇప్పటికీ చాలా మంది రైతులకు రుణమాఫీ పూర్తి కాలేదని, ఎరువులు, విత్తనాల కోసం ఇబ్బందులు పడుతున్నారని, మళ్లీ సావుకార్లను ఆశ్రయించే పరిస్థితి వచ్చిందన్నారు. బీఆర్ఎస్ హయాంలో కేసీఆర్ రైతుబంధు, రైతుబీమా, 24 గంటల విద్యుత్, సాగునీరు అందించారని, రైతు ఏ కారణంతో మరణించినా రూ.5 లక్షల బీమా ఇచ్చారని గుర్తు చేశారు. ప్రస్తుతం 24 గంటల కరెంటు లేదని, కన్నెపల్లి పంపుల వద్ద నీరు ఉన్నా రైతులకు ఇవ్వడంలో ప్రభుత్వం విఫలమైందని, నాట్లు ఎండిపోతున్నాయని ఆరోపించారు. 420 హామీలను అమలు చేసే వరకు బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పునుగోటి కృష్ణరావు, పులి వెంకట్, ప్రభాకర్ రెడ్డి, అంకం రాజేశం, రాచకొండ చందు, కొత్తూరి స్వామి తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్మీ నరసింహస్వామి ఆలయ అభివృద్ధికి

# నిధులు మంజూరు చేయాలి

**-మంత్రి లక్ష్మణ్ కుమార్ కు వినతి**



**చురకలు విలేకరి, బీర్పూర్, సెప్టెంబర్ 3 :** మండల కేంద్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం, సుమారు వెయ్యేళ్ల ప్రాచీన చరిత్ర కలిగిన శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ గురువారం ఆలయ పాలకమండలి, స్థానిక ప్రజాప్రతినిధులు రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ను గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు.స్థానిక ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ చొరవతో ఈ వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. బ్రహ్మోత్సవాల సమయంలో సుమారు రెండు లక్షల మంది భక్తులు తరలివచ్చే ఈ క్షేత్రంలో సౌకర్యాలు విస్తరించాల్సిన అవసరం ఉందని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఇప్పటికే దాతలు, భక్తుల సహకారంతో కోటి రూపాయలతో మండపం వెడల్పు, గోపుర నిర్మాణం పూర్తి చేశామని వివరించారు. ఆలయ సమగ్ర అభివృద్ధికి దాదాపు రూ.5 కోట్లు అవసరమని, ప్రాకార మండపం, యాగశాల, హనుమాన్ మందిరం, రాజగోపురం, కోనేరు పునర్నిర్మాణం, ఘాట్ రోడ్డు వెడల్పు, జాతర ప్రాంత రహదారుల విస్తరణ, శిథిలమైన రథశాల పునర్నిర్మాణానికి ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని కోరారు.వినతిపై మంత్రి లక్ష్మణ్ కుమార్ సానుకూలంగా స్పందిస్తూ నిధుల మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ చీర్నెని శ్రీనివాస్, సర్పంచ్ ఎలమట్ల హరీష్, ఉప సర్పంచ్ జితేందర్, కమిటీ సభ్యులు చల్ల లక్ష్మణ్ యాదవ్, చెన్న గంగాధర్, ఎనగంటి సతీష్, యశోద రమేష్, చెట్టిపల్లి సత్యనారాయణ, జైన మాజీ సర్పంచ్ కుంట సుధాకర్, ఆలయ పూజారులు పెద్ద సంతోష్, చిన్న సంతోష్, మధు తదితరులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధుల నివారణపై ప్రత్యేక దృష్టి



**చురకలు విలేకరి,మెట్ పల్లి, సెప్టెంబర్ 3 :** మండలంలోని ఆత్మకూర్ సబ్‌సెంటర్‌ను వైద్యాధికారి డా. ఎల్లాల అంజిత్ రెడ్డి గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వివిధ జాతీయ ఆరోగ్య కార్యక్రమాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ప్రస్తుతం సీజనల్‌గా ప్రబలుతున్న డెంగ్యూ, మలేరియా, వైరల్ జ్వరాలు, అతిసార వ్యాధుల నివారణ చర్యలపై సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. జ్వరాల పర్యవేక్షణ, ఇంటింటి సర్వేలు, దోమల నివారణ, తాగునీటి పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని సిబ్బందిని ఆదేశించారు.

## ప్రజలకు సేవ చేయడమే లయన్స్ క్లబ్ ప్రధాన లక్ష్యం



**చురకలు విలేకరి,రాయికల్,సెప్టెంబర్ 3 :** ప్రజలకు సేవ చేయడమే లయన్స్ క్లబ్ ప్రధాన లక్ష్యం అని లయన్స్ క్లబ్ అధ్యక్షులు వాసం ప్రసాద్ అన్నారు.గురువారం రాయికల్ మండలం అల్లిపూర్ గ్రామ మున్నూరు కాపు సంఘ భవనంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కరీంనగర్ రేకుర్తి కంటి హాస్పిటల్ వైద్యులచే ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు.ఉచిత కంటి వైద్య శిబిరంలో 122 మందికి కంటి పరీక్షలు చేయగా 43మందిని ఆపరేషన్ కోసం గుర్తించి రేకుర్తి కంటి హాస్పిటల్ కు వైద్యతో సహా తరలి వెళ్లారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.లయన్స్ క్లబ్ సుమారు 3579 మందికి కంటి ఆపరేషన్లతో పాటుగా మరెన్నో సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. ప్రోగ్రాం చైర్మన్ లయన్ తంగేళ్ల రమేష్ మాట్లాడుతూ ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.ఉచిత వైద్య సేవలు అందించేందుకు భవిష్యత్తులోనూ మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తాం అని తెలిపారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎంబారి గౌతమి వెంకటేష్,లయన్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి కనపర్తి శ్రీనివాస్,కోశాధికారి సుధవేణి మురళి,చార్టర్డ్ ప్రెసిడెంట్ మోర హన్మాండ్లు,టెక్నీషియన్ ప్రభాకర్,క్లబ్ సభ్యులు మచ్చ శేఖర్,దాసరి గంగాధర్,కుర్మ సుదర్శన్ రెడ్డి,కట్ల నర్సయ్య,సత్యనారాయణ, పారిపెల్లి శివప్రసాద్,సింగిల్ విండో చైర్మన్ రాజలింగం,గ్రామీణ వైద్యులు గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## వికాస్ మోడల్ స్కూల్‌లో కృష్ణాష్టమి వేడుకలు



**చురకలు విలేకరి, మల్లాపూర్, సెప్టెంబర్ 3 :** మండల కేంద్రంలోని వికాస్ మోడల్ పాఠశాలలో గురువారం ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించి, పిల్లలతో ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ అశోక్, ప్రిన్సిపాల్ లావణ్య, టీచర్స్ సానజ, సుచిత్ర, రోజా, సుస్మిత, తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమ విద్యార్థులకు సకల సౌకర్యాలు

**-వారంలో ఒకసారి పాఠశాలల తనిఖీచేయాలని అధికారులకు ఆదేశం**

**-వెల్గటూర్ కస్తూర్బ పాఠశాలలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన**

**-రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మణ్ కుమార్**



**చురకలు, విలేఖరి, వెల్గటూర్, సెప్టెంబర్ 03 :** రాష్ట్రంలోని సాంఘిక సంక్షేమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి సౌకర్యాలు కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు. జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం కుమ్మరిపల్లి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో రూ.67 లక్షల తో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు మంత్రి గురువారం శంకుస్థాపనలు చేశారు.ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి సహ పంక్తి భోజనం చేసిన మంత్రి విద్యార్థులకు షూష్ తోపాటు బ్యాగులను అందజేశారు.మండలం లోని తహసిల్దార్,ఎంపీడీవోలు వారంలో ఒకరోజు ప్రభుత్వ పాఠశాలలను, సంక్షేమ వసతి గృహాలను తనిఖీ చేసి విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు పరిశీలించాలని ఆదేశించారు.ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు చదువులో రాణించాలని కోరారు. రాష్ట్రంలోని సంక్షేమ శాఖ హాస్టళ్లలో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం అందించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని మంత్రి తెలిపారు. కార్పొరేట్ స్థాయి లో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు సౌకర్యాలు కల్పించడం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యమని మంత్రి లక్ష్మణ్ కుమార్ అన్నారు.ఆయన ఆలోచనతోనే రాష్ట్రంలోని సంక్షేమ హాస్టల్లో చదువుతున్న విద్యార్థులకు సౌకర్యాలు కల్పిస్తున్నామని మంత్రి తెలిపారు. కుమ్మరిపల్లి కస్తూర్బా వసతి గృహాన్ని ప్రతినెలకు ఒకసారి సందర్శిస్తానని మంత్రితెలిపారు. విద్యార్థులకు అవసరమైన క్రీడామైదానం ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు చదువులో రాణిస్తూ మంచి మార్కులు సాధించినందుకు పాఠశాల ఉపాధ్యాయులను మంత్రి అభినందించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జక్కుల ఆమని, జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, వెల్గటూర్ తహసీల్దార్ తో పాటు పలువురు అధికారులు వివిధ గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.



# అర్హులందరికీ స్మార్ట్ రేషన్ కార్డులు



**-మంత్రి లక్ష్మణ్‌కుమార్**

**చురకలు విలేకరి ఎండపల్లి, సెప్టెంబర్ 3 :** గత ప్రభుత్వ హయాంలో రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు చేసుకునే పరిస్థితి ఉండేదని, ప్రజా ప్రభుత్వంలో అర్హులైన ప్రతి కుటుంబానికి స్మార్ట్ రేషన్ కార్డులు అందిస్తున్నామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. గురువారం ఎండపల్లి మండల కేంద్రంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి వెల్గటూర్ మండల అభివృద్ధికి కట్టుబడి ఉన్నా న్నారు.ఎండపల్లి మండలంలో పాలి టెక్నిక్ కళాశాల, పాసిగాంలో ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటుకు కృషి చేస్తామని తెలిపారు.ఎండపల్లిలో అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని, సీసీ రోడ్లు, డ్రైనేజీ,ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణం పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఎక్స్‌ప్రెస్ బస్సు నిలుపుదల, జూనియర్ కళాశాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.కార్యక్రమంలో సర్పంచ్ మారం సునీత,ఉపసర్పంచ్ వార్డ్ సభ్యులు, అడిషనల్ కలెక్టర్ లత, ఆర్డీఓ మధుసూదన్, అధికారులు,వివిధ గ్రామాల సర్పంచ్ లు కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# నుస్తులాపూర్‌లో కాంగ్రెస్ సంబరాలు



**చురకలు విలేఖరి,తిమ్మాపూర్, సెప్టెంబర్ 03 :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా తిమ్మాపూర్ మండలం నుస్తులాపూర్లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రం లో పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ ర్యాలీ చేపట్టారు. అనంతరం సమావేశం నిర్వహించి ప్రభుత్వ పాలనలో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు.కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బండారి రమేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తుందని తెలిపారు. మహిళలకు మహాలక్ష్మి పథకం, ఉచిత బస్సు ప్రయాణం, రూ. 500కే గ్యాస్ సిలిండర్, గృహజ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రైతుభరోసా,రుణమాఫీ, పేదలకు ఇందిరమ్మ ఇళ్ళు, రాజీవ్ ఆరోగ్య శ్రీ, కొత్త రేషన్ కార్డులు వంటి పలు కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తుందని పేర్కొన్నారు.గత బిఆర్ ఎస్ ప్రభుత్వం పదేళ్ల అధికారంలో ఉన్న ఏ ఒక్క హామీ నెరవేర్చలేదని విమర్శించారు. ప్రజల జీవితాల్లో వెలుగులు నింపటమే సీ ఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. కార్యక్రమంలోపార్టీ మండల అధ్యక్షుడు బండారి రమేష్, సొసైటీ చైర్మన్ లు మొరపల్లి రమణా రెడ్డి, గోపు మల్లారెడ్డి, ప్రజా ప్రతినిధులు, నాయకులు,శ్రీనివాస్ రావు, గంకిడి లక్ష్మా రెడ్డి, శ్రీగిరి రంగా రావు, ఆసోద శ్రీనివాస్, జింక మారుతి, శోభా రాణి, వీర చంద్ర రెడ్డి, మామిడి అనిల్, రాములు, సంపత్ రెడ్డి , కంది లక్ష్మీనారాయణ రెడ్డి, శ్రీనివాస్, మెరుగు మోహన్, కొత్త తిరుపతి రెడ్డి, రాజేందర్ రెడ్డి, మల్లా రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

## ఆల్ఫోర్స్‌లో...

# ఆకట్టుకున్న కృష్ణాష్టమి వేడుకలు

**-హాజరైన ఆల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి. నరేందర్ రెడ్డి**



**చురకలు ప్రతినిధి హుజురాబాద్ సెప్టెంబర్ 3 :** కష్టాల్లో ఉన్నవారికి కొండంత భరోసానిచ్చి, భగవద్గీత రూపంలో మానవాళికి దిశానిర్దేశం చేసిన శ్రీకృష్ణుడి దివ్య జన్మదినమే శ్రీకృష్ణాష్టమి అని ఆల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి. నరేందర్ రెడ్డి అన్నారు. స్థానిక పట్టణంలోని ఆల్ఫోర్స్ జీనియస్ పాఠశాలలో గురువారం ముందస్తు శ్రీకృష్ణాష్టమి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలతో అలరించారు. ఉట్టి వేడుకలను ఉత్సాహంగా నిర్వహిస్తూ విద్యార్థులు సందడి చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ వి. నరేందర్ రెడ్డి మాట్లాడుతూ.. చదువుల్లో, ఆటల్లో ఎలాంటి కష్టాలు ఎదురైనా ధైర్యంగా ఎదుర్కొనే తత్వాన్ని శ్రీకృష్ణుడి జీవితం నుంచి విద్యార్థులు నేర్చుకోవాలని సూచించారు. శ్రీకృష్ణాష్టమికి విశిష్టమైన చరిత్ర, ఆధ్యాత్మిక ప్రాధాన్యత ఉందన్నారు. శ్రీకృష్ణుడి జీవితం తల్లి ప్రేమ, ఆప్యాయతలకు ప్రతిబింబంగా నిలుస్తుందన్నారు. శ్రీకృష్ణుడి బాల్య లీలలు, చిలిపి చేష్టలు చిన్నారుల్లో ఆనందాన్ని నింపడంతో పాటు, జీవితంలోని విలువలను తెలియజేస్తాయని అన్నారు. శ్రీకృష్ణ జన్మ వృత్తాంతం, ధర్మ పరిరక్షణ కోసం ఆయన చేసిన కృషి నేటి తరానికి స్ఫూర్తిదాయకమని తెలిపారు. ధర్మం వైపు నిలిచి, అధర్మాన్ని ఎదుర్కొనే స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ అలవరచుకోవాలని సూచించారు. వేడుకల్లో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన శ్రీకృష్ణుడి లీలలను తెలిపే నృత్య రూపకాలు, కోలాటాలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. పాఠశాల ఆవరణలో పండగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## భార్యను అతి దారుణంగా హత్య చేసిన

# నిందితుడి అరెస్ట్...రిమాండ్

**-హత్యకు సంబంధించిన వివరాలను వెల్లడించిన సీఐ ఓ వెంకటేష్**



**చురకలు ప్రతినిధి,ఎల్లారెడ్డి పేట సెప్టెంబర్ 03 :** ఎల్లారెడ్డిపేట సర్కిల్ పరిధిలోని పదిర గ్రామంలో చోటుచేసుకున్న దారుణ హత్య కేసుకు సంబంధించి నిందితుడిని గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎల్లారెడ్డిపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంకటేష్ తెలిపారు.సంఘటనకు సంబంధించిన వివరాలను సీఐ ఓ వెంకటేష్ గురువారం రాత్రి 9 :00 గంటలకు వెల్లడించారు.ముస్తాబాద్ మండలం చీకోడు గ్రామానికి చెందిన పల్లెపు సురేష్ అనే వ్యక్తి తన భార్య పల్లెపు జ్యోతి లకు కుటుంబ కలహాలు జరిగగా,ఆమె పై అనుమానం పెంచుకున్నాడు. పథకం ప్రకారం 02-09-2026 నాడు పదిర గ్రామానికి వచ్చి అతని భార్య పల్లెపు జ్యోతిపై విచక్షణారహితంగా తాను వెంట తెచ్చుకున్న కత్తితో గొంతుపై, శరీర భాగాలపై విపరీతంగా పొడిచి హత్య చేశాడు. అడ్డువచ్చిన మృతురాలి తల్లి గండికోట ఎల్లవ్వపై కూడా అదే కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. ఈ దాడిలో పల్లెపు జ్యోతి అక్కడికక్కడే మృతి చెందగా, తీవ్ర గాయాలపాలైన గండికోట ఎల్లవ్వను చికిత్స నిమిత్తం వెంటనే ఆసుపత్రికి తరలించామని.ఈ ఘటనపై మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎల్లారెడ్డిపేట పోలీస్ స్టేషన్‌లో Cr. No. 229/2026, U/Sec 103(1), 109(1) దీచీూ చట్టం కింద కేసు నమోదు చేశామని నేరస్థుడిని విచారించి నిందితుడిని చట్టపరమైన ప్రక్రియపూర్తి చేసి కోర్టు ముందు హాజరుపరిచి రిమాండ్‌కు తరలించామని సిఐ తెలిపారు.సర్కిల్ ఇన్ స్పెక్టర్ ఓ. వెంకటేష్ మాట్లాడుతూ... సమాజంలో చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడేవారిపై, శాంతిభద్రతలకు భంగం కలిగించే వారిపై పోలీసు శాఖ ఆధ్వర్యంలో అత్యంత కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కుటుంబ కలహాలు లేదా ఏ ఇతర వ్యక్తిగత సమస్యలు ఉన్నా చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకుండా చట్టపరమైన మార్గాలను ఆశ్రయించాలని ఆయన సూచించారు.